క్లుప్తంగా

వేతనదారులు కొలతల ఆధారంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలో ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే వేతనదారులు టెక్నికల్ సహాయకులు ఇచ్చిన మెజర్‌మెంట్స్ ఆధారంగా పని చేసి కిట్టుబాటు వేతనం అందుకోవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం లక్ష్మీపురంలో వేతనదారులు చెరువులో చేస్తున్న పనులను ఆయన పరిశీలించి వేతనం ఏవిధంగా కిట్టుబాటవుతోందో అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ 20 రోజులుగా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ సరేష్‌కుమార్, టెక్నికల్ సహాయకులు క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

24 నుంచి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు

సీతానగరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈ నెల 24వ తేదీ నుంచి ఇంటర్‌మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడానికి ఉన్నతాధికారుల సూచనల మేరకు సిద్ధం చేశామని ప్రిన్సిపాల్ బి.రేణుక తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మాట్లాడుతూ సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారని అన్నారు. 2023 మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో తప్పిన వారిలో 24 నుంచి ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకూ, సెకెండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ జరుగుతాయని చెప్పారు. 1604 మంది ఈ పరీక్షలు రాయనున్నట్లు తెలియజేశారు.

కూలిన ఇల్లు పరిశీలన



బాధితులతో మాట్లాడుతున్న ఆర్ఐ పి.కరుణాకర్

సీతానగరం: ఈదురు గాలుల కారణంగా గురువారం సాయంత్రం మండలకేంద్రంలోని కాలనీలో కూలిపోయిన సిమ్మెంట్‌రేకుల ఇంటిని ఆర్ఐ పి.కరుణాకర్, వీఆర్వో సింహాచలం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ బాధితుడు పోరాపు శంకరరావు ఇంటిపై బూరుగు చెట్టు గాలికి పడిపోవడంతో గోడలు శిథిలమయ్యాయని, రేకులు పాడైపోవడంతో ఇంట్లో సామగ్రి తడిసి ముద్దయి నష్టం వాటిల్లినట్లు తెలియజేశారు. జరిగిన నష్టాన్ని అంచనావేసి తహసీల్దార్ ఎన్వీరమణకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

భామిని: మండలంలో పారా లీగల్ వలంటీర్ల నియామకానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల న్యాయ సేవా సంఘం, కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి(ఇన్‌చార్జి) ఎస్.మణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా సేవాభావంతో పని చేయడానికి ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాజకీయ ప్రమేయం లేకుండా, ఉద్యోగ విరమణ చేసిన వారు, వయోవృద్ధులు, న్యాయ సంబంధిత విద్యార్థులు, మైత్రీ సంఘ సభ్యులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు తదితరులు అర్హులని పేర్కొన్నారు.

ఉత్సవాలకు ఎమ్మెల్యే కళావతికి ఆహ్వానం



ఎమ్మెల్యే కళావతికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

వీరఘట్టం: పాతపట్నం నీలమణి దుర్గ ఉత్సవాలు ఈ నెల 21 నుంచి 30 వరకు జరగనున్న నేపథ్యంలో పాల్గొనాలని కోరుతూ ఉత్సవ కమిటీ సభ్యులు పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జీసీసీ రేషన్ డిపోలు సక్రమంగా తెరవాలి

సీతంపేట: గిరిజన సహకార సంస్థ (జీసీసీ)రేషన్ డిపోలు సక్రమంగా తెరవాలని డివిజనల్ మేనేజర్ జి.సంధ్యారాణి అన్నారు. స్థానిక జీసీసీ బ్రాంచ్ కార్యాలయంలో డివిజన్ స్థాయిలో సేల్స్ మెన్లు, డీలర్లతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ డిపోలు తెరిచే సమయం బోర్డు పెట్టాలన్నారు. కొంతమంది సేల్స్‌మన్ల పనితీరు సంతృప్తికరంగా లేదన్నారు. అన్ని రకాల నిత్యావసర సరుకులను డిపోల్లో విక్రయించాలన్నారు.

సేవావజ్రతో వేణుకు సత్కారం



ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందిపుచ్చుకుంటున్న వేణుగోపాలరావు

సీతానగరం: మండలంలో గ్రామ వలంటీర్లుగా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఇద్దరు వలంటీర్లకు సేవావజ్ర ప్రశంసాపత్రాలను ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు కలెక్టరేట్‌లో శుక్రవారం అందజేశారు. పెదంకలాం గ్రామానికి చెందిన వలంటీరు వి.వేణుగోపాలరావు, సుమిత్రాపురం గ్రామానికి చెందిన వలంటీరు అనసూయకు వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రశంసాపత్రాలను అందజేసి సత్కరించడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు అభినందిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ కన్వీనర్‌కు సత్కారం

సాలూరు: వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్‌గా నియమితులైన మున్సిపల్ ఫ్లోర్‌లీడర్, కౌన్సిలర్ గొర్లె జగన్‌కు మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ హాల్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో గొర్లె జగన్ మాట్లాడుతూ, ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర, విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అందరి సహకారంతో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, జగరబోయే ఎన్నికల్లో విజయానికి కృషి చేస్తానని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పార్టీల కతీతంగా, అవినీతి రహితంగా పారదర్శక పాలన అందిస్తున్నారని కొనియాడారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు ముఖ్యమంత్రి అండగా నిలిచారన్నారు. పేదలకు ఇచ్చే స్థలాలు శవాలు పూడ్చడానికి సరిపోతాయంటూ టీడీపీ నాయకుడు చంద్రబాబునాయుడు అనడం పేదల పట్ల ఆయనకు ఎంత చిన్నచూపు ఉందో అర్థం అవుతోందన్నారు. లోకేష్ యువగళం పాదయాత్రకు జనాదరణ లేక వెలవెలబోతోందని ఎద్దేవా చేశారు. టీడీపీ, ఎల్లో మీడియా పెత్తందారులకు అండగా నిలుస్తూ.. పేద, మధ్య తరగతి వర్గాలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఆశీస్సులతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



గొర్లె జగన్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, నాయకులు

కాశీపేటలో సీసీ రోడ్డు పనులు



కాశీపేటలో సీసీ రోడ్డు పనులకు సిద్ధంగా మెటీరియల్

సీతానగరం: మండలంలోని కాశీపేట గ్రామంలో సర్పంచ్ టి ధనుంజయమ్మ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడానికి సిద్ధం చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి మురళి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రూ.2 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనుల మెటీరియల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవ కారణంగా గ్రామానికి రూ.15 లక్షల వ్యయంతో మంచినీటి పథకం, రూ.35 లక్షలతో ఇంటింటి కుళాయిల పనులను పూర్తి చేశామన్నారు. దీంతో ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా చేయగలుగుతున్నట్లు చెప్పారు. నూతనంగా సర్పంచ్ ధనుంజయమ్మ పర్యవేక్షణలో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, గ్రామ శివారులో డ్రెయిన్స్ నిర్మాణం, పనులకు అనుమతులు రావడంతో రెండురోజుల్లో పనులు చేపడతామన్నారు. ప్రభుత్వం మంజూరుచేస్తున్న నిధులతో ప్రజల అవసరాలకు అనుగుణంగా దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓపీసీఎస్ చైర్మన్ బి.ధనుంజయ్, నంజయ్, మిల్క్ సొసైటీ అధ్యక్షులు టి.శ్రీనివాస రావు, విశ్రాంత వీఆర్వో ఎం.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

సగటు వేతనం కచ్చితంగా రావాల్సిందే...



కొండాపురంలో ఉపాధి పనుల తీరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: ఉపాధి వేతనదారులకు సగటు వేతనం రూ.275 వచ్చేలా మస్తర్లు వేయడం, వారితో ఆ విధంగా పనులు చేయించడం పై క్షేత్ర సహాయకులు దృష్టి పెట్టాలని ఎంపీడీఓ డొండ త్రినాధులు అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలో సాగునీటి బట్టిలో వేతనదారులు చేపడుతున్న పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. హాజరైన వేతనదారులు, వారికి సగటున అందుతున్న కూలీపై ఆరా తీశారు. పనులు జరుగుతున్న చోట కచ్చితంగా ప్రథమ చికిత్స కిట్లు, వడదెబ్బ నుండి తక్షణ రక్షణ కల్పించే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాట్లో ఉండేలా చూడాలన్నారు. ఎండల తీవ్రతకు అనుగుణంగావృద్ధులకు, ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి తాత్కాలికంగా వారికి పనులు కల్పించవద్దన్నారు. ఎండలో పనులు చేయటం వలన కలిగే ఇబ్బందులపై వారికి అవగాహన కల్పించాలన్నారు.

ఉద్యాన నర్సరీని పరిశీలించిన పీఓ



నర్సరీని పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానికంగా తురాయిపువలస వద్ద ఉన్న హెచ్ఎన్‌టీసీ నర్సరీ యూనిట్‌ను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మొక్కలు ఏఏ రకాలు ఉన్నాయనేది చూశారు. ఎలా అంటుకడుతున్నారనేది పరిశీలించారు. వాణిజ్యపరమైన మొక్కలు పెంచితే బాగుంటుందని, ఈ దిశగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. నర్సరీని అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కుండంగి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

- మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్ మోహన్‌రావు

సంతకవిటి: అన్ని శాఖల అధికారుల సహకారంతోనే మండలంలో అభివృద్ధి సాధ్యమని జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎస్.మంజుల అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆయన మండలంలోని అన్ని పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. అంతకుముందు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖపై సమీక్ష నిర్వహించగా జేఈ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ వేసవిలో నీటిఎద్దడి లేకుండా క్రాస్‌పోగ్రాం ద్వారా బోర్లు మరమ్మతులు చేశామని తెలిపారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా అన్ని గ్రామాల్లో ప్రతీ ఇంటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి, తహసీల్దార్ సులోచనరాణి మాట్లాడుతూ ప్రతినెలా సరైన సమయానికి లబ్ధిదారుల ఇంటి వద్దకే మొబైల్ వ్యాన్ ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. త్వరలో ఐరిస్ ద్వారా కూడా సరుకులు అందిస్తామన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ గృహనిర్మాణదారులకు సకాలంలో పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని సూచించారు. సమావేశంలో ఏఓ నవీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూకాలమ్మ, కృష్ణంవలస సర్పంచ్ సురేష్, చిత్తారిపురం సర్పంచ్ మోహన్‌రావు, జేసీఎస్ కన్వీనర్ రమేష్‌నాయుడు, ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి, ఏపీడీ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే డెంగీ నుంచి రక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పాలకొండ రూరల్: క్షేత్ర స్థాయిలో డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించటం ద్వారా ఈ మహమ్మారి నుండి రక్షణ పొందవచ్చని అన్నవరం, ఎం.సింగుపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు కడియం చిరంజీవి, కల్‌నాథ్ అన్నారు. ఎంపీడీఓ డి.త్రినాధులతో కలసి మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయాల సిబ్బంది, సెక్రటరీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో శుక్రవారం సమీక్షించారు. డెంగీ, సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ప్రస్తుత సీజన్‌లో పల్లెల్లో నమోదవుతున్న ఆరోగ్యపరమైన సమస్యలు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం సమకూరుస్తున్న మందులు, వాటి వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ముఖ్యంగా దోమల నివారణపై విస్తృత ప్రచారం చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత కల్పించాలన్నారు.



- కమ్మేసిన మేఘాలు

వీరఘట్టాన్ని శుక్రవారం సాయంత్రం మేఘాలు కమ్మేశాయి. ఊరంతా దుప్పటి పరచినట్టు ఆకాశాన మేఘాలు చుట్టుముట్టాయి. చూపరులకు కాసేపు కనువిందు చేశాయి. సాక్షి కెమెరాకు ఇలా ఆ చిత్రం చిక్కింది. యువత తమ సెల్‌ఫోన్లలో మేఘాలను బంధించారు. – వీరఘట్టం

జీజీఎంపీ పనులు వేగవంతం చేయాలి



వెంకటాపురంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్, ఏఈ చంద్రమౌళి

సీతానగరం: మండలంలో గడపగడపకు మనప్రభుత్వం (జీజీఎంపీ) పథకం నిధులతో మంజూరుచేసిన పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్, మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి కోరారు. ఈ మేరకు శుక్రవారం వెంకటాపురం, నిడగల్లు, గెడ్డలుప్పి, బగ్గందొరవలస గ్రామాల్లో జీజీఎంపీ నిధులతో మంజూరుచేసిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మండలంలో ఇంతవరకూ 18 సచివాలయాల్లో గడపగపడకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి సచివాలయం పరిధిలో ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడానికి సచివాలయానికి రూ 20 లక్షలు వంతున నిధులను ప్రభుత్వం మంజూరు చేసింద న్నారు. నిధులు విడుదల చేయడంతో నిర్దేశించిన పనులను పూర్తి చేయాలని నిర్వాహకులపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. గ్రామాల్లో డ్రైన్‌లు, సీసీ రోడ్లు, కల్వర్టులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే వివిధగ్రామాల్లో పనులు పూర్తయ్యాయన్నారు. ఇంతవరకూ పనులు ప్రారంభించని గ్రామాల్లో పనులు వేగవంతం చేయాలని, నిధుల కొరతలేద అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల ప్రయోజనాలపై అవగాహన



రైతులతో మాట్లాడుతున్న ఏఓ శ్రావణ్

బలిజిపేట: పచ్చిరొట్ట విత్తనాల వినియోగం? వాటి ప్రయోజనాలపై ఏఓ శ్రావణ్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు మండలంలోని వంతరాంలో రైతులతో సమావేశం నిర్వహించి పచ్చిరొట్ట విత్తనాలను భూమిలో వేసుకుని 30–45రోజుల్లో భూమిలో కలియదున్నాలని సూచించారు. ఇలా చేయడం వల్ల 9–10టన్నుల పచ్చిరొట్ట భూమికి అందడంతో భూసారం, తద్వారా ఉత్పాదక శక్తి పెరుగుతాయని తెలిపారు. నేల గుల్లబారి చౌడు విరిగిపోతుందన్నారు. గాలిలో ఉండే నత్రజనిని స్థిరీకరించడం వల్ల సూక్ష్మజీవుల అభివృద్ధి పెరుగుతుందన్నారు. భూమిలో కలియదున్నడం వల్ల 5నుంచి 10శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడు



సీఐటీయూ కార్యాలయంలో సుందరయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

బలిజిపేట: పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని సీపీఎం మండల సీనియర్ నాయకుడు జి.సత్యనారాయణ కొనియాడారు. బలిజిపేట సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు జి.బలరాంనాయుడు ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలలో ఒక కొత్త మార్గాన్ని చూపిన మహావ్యక్తి అని కీర్తించారు. ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల పథకాలు, భూ సమస్య, సోషలిస్టు వ్యవస్థ స్థాపన వంటి అంశాలపై పుస్తకాలు రాశారని గుర్తు చేశారు. కులవ్యవస్థ నిర్మూలన కోసం అంబేడ్కర్ పోరాడిన విధంగా స్వగ్రామంలో వివక్షపై పోరాటంతో ఆయన జీవితాన్ని ఆరంభించారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం పెట్టి కూలి పోరాటాలు, పేదల కోసం నిరంతర పోరాటాలు చేశారని చెప్పారు. ప్రజలకోసం నిరంతరం శ్రమించే సుందరయ్య సేవలను పునస్మరించుకోవడం ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో జి.సత్యనారాయణ, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లికి ఘనంగా నివాళులు

సీతానగరం: దోపిడీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో పోరాటం చేసిన మహాయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం ఆవరణలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి వి.వెంకటరమణ ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 30వ వర్ధంతి సభజరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు రెడ్డి లక్ష్మునాయుడు, వి రమలక్ష్మి, సీహెచ్ కృష్ణ, ఆర్.రమణమూర్తి పాల్గొన్నారు.



సీతానగరం: కామ్రేడ్ సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం కార్యకర్తలు



పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులు అర్పిస్తున్న ఎన్‌వై నాయుడు, నాయకులు

పుచ్చలపల్లి ఆదర్శప్రాయుడు

సాలూరు: దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఎం నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా పట్టణం, మండలంలోని పలుచోట్ల ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజకీయ నాయకుడిగా ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరావు, శ్రీను, విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలుకు సిద్ధం



బాలేరులో మొక్కజొన్న గింజలు పరిశీలిస్తున్న సొసైటీ అధికారులు

భామిని: మండలంలోని మొక్కజొన్న పంటను పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోలు చేయనున్నట్టు భామిని సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణారావు తెలిపారు. బాలేరు, సొలికిరి గ్రామాల్లో రైతులు ఆరబోసిన మొక్కజొన్న పంటలను శుక్రవారం పరిశీలించారు. జొన్న పండించిన రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేపట్టామన్నారు. క్వింటా రూ.1960లు మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఆర్‌బీకేల్లో పంట నమోదు చేసుకొన్న రైతుల వారీగా ఈకేవైసీ చేసిన పంటను వ్యవసాయ సహాయకులు ఆధ్వర్యంలో పరిశీలిస్తున్నామని తెలిపారు. భామిని సొసైటీ పరిధిలో ఆర్‌బీకేల్లో గుర్తించిన 234 మంది రైతుల పంట కొనుగోలుకు ఐదు వేల గోనె సంచులు సిద్ధం చేశామన్నారు. వారి వెంట వ్యవసాయ సహాయకురాలు జ్యోతి, రైతు మిత్ర తిరుపతి, రైతులు, సొసైటీ సిబ్బంది ఉన్నారు.